

శాస్త్రోక్తంగా సహస్ర దీపాలంకరణ

బనగానపల్లె రూరల్: నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి సోమవారం పౌర్ణమి సందర్భంగా సహస్ర దీపాలంకరణ సేవను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.



బస్సులు కిటకిట

దసరా సెలవులు ముగియడంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగింది. సోమవారం తెల్లవారుజాము నుంచే చాలా మంది కొలిమిగుండ్ల, అవుకు ఆర్టీసీ బస్టాండ్‌లకు వచ్చారు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:14,467
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:13,955

న్యూస్‌రీల్

రాష్ట్ర పండుగలా మహర్షి వాల్మీకి జయంతి

- నేడు కర్నూలులో రాష్ట్రస్థాయి ఉత్సవాలు

కర్నూలు(అర్బన్): మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగలా నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్ సవిత తెలిపారు. ఈ నేపథ్యంలోనే కర్నూలులో రాష్ట్ర స్థాయి జయంతి ఉత్సవాలను ఈ నెల 7వ తేదిన (నేడు) ఘనంగా నిర్వహించనున్నట్లు ఆమె సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి టీజీ భరత్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నారని చెప్పారు.

ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్ విడుదల

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ప్రభుత్వ సర్వజన వైద్యశాలల్లో పోస్టుల భర్తీకి ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్ విడుదల చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 10 కేటగిరీల్లో పోస్టులు భర్తీ చేసేందుకు జూలై 7న నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఏడు కేటగిరీల్లో పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారి ప్రొవిజినల్ మెరిట్ లిస్టులను https://kurnool.ap.gov.in, https://kurnoolmedicalcollege.ac.in వెబ్ సైట్‌లలో అప్‌లోడ్ చేశామని తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 8 నుంచి 10వ తేదీలోపు కర్నూలు మెడికల్ కాలేజీలో సాయంత్రం 5 గంటల్లోపు లిఖిత పూర్వకంగా సమర్పించాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో పంపిన అభ్యంతరాలు స్వీకరించబోమని తెలిపారు.

వ్యవసాయ శాఖలో ఐదుగురు ఏడీఏలకు పదోన్నతి?

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖలో ఐదుగురు సహాయ సంచాలకులకు ఉప సంచాలకులుగా పదోన్నతులు లభించనున్నట్లు సమాచారం. వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఐదుగురు ఏడీఏలకు సంబంధించి నివేదిక పంపినట్లు తెలిసింది. వీరిలో కర్నూలులోని పురుగు మందల నాణ్యతా ప్రమాణాల పరీక్ష కేంద్రం ఏడీఏ సంధ్యారాణి, పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్, కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, నంద్యాల ఏడీఏ ఆంజనేయ(ఇటీవల మరణించారు), కర్నూలు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో అగ్రానమీ ఏడీఏ రాజశేఖర్ ఉన్నారు. త్వరలోనే డిపార్టుమెంటల్ ప్రమోషన్ కమిటీ(డీపీసీ) సమావేశమై పదోన్నతులను ఖరారు చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

కర్నూలు(సెంట్రల్): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం కర్నూలు జిల్లా న్యాయవాదులు తమ విధులను బహిష్కరించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు హరినాథ్ చౌదరి, ఎం.వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం సుప్రీంకోర్టులోజరిగిన ఘటనను ఖండిస్తూ బార్ అసోసియేషన్ కార్యవర్గం ఈ మేరకు తీర్మానం చేసినట్లు తెలిపారు.

గవాయ్‌పై దాడి చట్ట వ్యతిరేకం..

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి చట్ట వ్యతిరేకమని, దీనిని ఖండిస్తున్నట్లు బార్‌అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కె. ఓంకార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఘటన దురదృష్ట కరమని, ఇది భారతదేశ చరిత్రకు మచ్చవంటిందన్నారు.

అన్నప్రసాద వితరణకు విరాళాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి పలువురు భక్తులు విరాళాలు అందించారు. సోమవారం గుంటూరుకు చెందిన వీరశేఖరరావు రూ.1,00,116, కర్నూలుకు చెందిన ఎల్.రమేష్‌బాబు రూ.1,01,101 విరాళాన్ని పర్యవేక్షకులు కె.శివప్రసాద్‌కు అందజేశారు. దాతలకు దేవస్థానం తరుపున జ్ఞాపికను అందించి సత్కరించారు.



నందవరం మండలం మిట్టాసోంపురానికి చెందిన ఈయన పేరు రామకృష్ణ. సర్వేలో ఈయన భూమిలో 89 సెంట్లు తక్కువగా ఉందని చూపారు. రీసర్వే కోసం ఐదు సార్లు చలానా కట్టినా ఒక్కసారి కూడా స్పందించలేదు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆరు సార్లు అర్జీలు ఇచ్చారు. ఆ సమయంలో సర్వేయర్లు ఆయనతో మాట్లాడి పరిష్కరించినట్లు రసీదు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. సమస్య మాత్రం అలాగే ఉంది. కలెక్టరేట్ కు, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాలకు తిరగడం ఈయనకు పరిపాటిగా మారిపోయింది.



మద్దికెర మండలం అగ్రహారం గ్రామానికి చెందిన ఈయన పేరు హరిప్రసాదు. ఈయనకు ఆరు ఎకరాల పొలం ఉండగా రీసర్వేలో 3.638 ఎకరాల పొలాన్ని మాత్రమే చూపారు. మిగిలిన 2.362 ఎకరాలను సమీపంలోని ఇతరుల పొలాల్లో కలిపి వేశారు. రీసర్వే కోసం పది సార్లు చలానా కట్టినా ఒక్కసారి కూడా స్పందించలేదు. అలాగే కలెక్టరేట్‌కు వచ్చి పీజీఆర్ఎస్‌లో సమస్యను పరిష్కరించాలని 12 సార్లు విన్నవించినా పరిష్కారం దొరలేదు. దీంతో ఈయన ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడం సర్వ సాధారణం అయిపోంది.

వీరిద్దరే కాదు జిల్లాలో ఎంతో మంది సర్వే సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఫలితం లభించడంలేదు. కాళ్లకున్న చెప్పులు అరిగిపోతున్నా వారి బాధలను మాత్రం అధికారులు పట్టించుకోవడంలేదు. పదుల సార్లు చలానా తీసినా సర్వే చేయడంలేదు. ఎందుకో ఏమిటో అర్థం కాక రైతులు అల్లాడిపోతున్నారు.

సర్వేత్రా తికమక!

- పొలం ఒకరిది.. పేరు మరొకరిది
- రైతులకు తప్పని అవస్థలు
- చలానా కట్టినా జరగని రీసర్వే
- టీడీపీ నేతలు చెప్పినట్లు చేస్తున్న సర్వేయర్లు!
- గ్రామసభలు నిర్వహించినా ఫలితం శూన్యం
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణలు



కల్లూరు మండలం యాపర్లపాడులో సర్వే చేస్తున్న దృశ్యం (ఫైల్)

కర్నూలు(సెంట్రల్): అన్నదాతలు తమ సమస్యల పరిష్కారం కోసం నిత్యం కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్, తహసీల్దార్ కార్యాలయాల్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇస్తుంటారు. అయితే వచ్చిన అర్జీలను మండల సర్వేయర్లు, విలేజ్ సర్వేయర్లు పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలేదు. వచ్చిన అర్జీలపై సర్వేయర్లు క్షేత్ర స్థాయికి వెళ్లకుండానే గడువు ముగిసే రోజున క్లోజ్ చేస్తున్నారు. అయితే ముడుపులు సమర్పించిన వారికి మాత్రం పని చేసి పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం వేలల్లో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఐవీఆర్ఎస్ సర్వేలో వెల్లడైంది. దాదాపు పది మంది గ్రామ సర్వేయర్లు, ఐదుగురు మండల సర్వేయర్లు సర్వే కోసం డబ్బులు వసూలు చేసినట్లు ప్రజలు ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్‌కు పంపారు.

టీడీపీ నేతల పెత్తనం

సర్వేయర్లపై టీడీపీ నేతల ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తే తెలుస్తోంది. కొంతమంది రైతులు ఎంత డబ్బులు ఇచ్చినా సర్వేయర్లు వారి సమస్యను పరిష్కరించరు. ఎందుకంటే వారికి ఆ గ్రామంలో ఉన్న టీడీపీ నేత గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలంట? వారి సిగ్నల్ ఎందుకని అధికారులను ప్రశ్నిస్తే అధికారం వారిది కాబట్టి తప్పదని నేరుగా సర్వేయర్లు చెబుతుండడంతో అన్నదాతలకు దిక్కుతోచడంలేదు. ఈ క్రమంలో సమస్య పరిష్కారం కావాలనుకున్న రైతులు గ్రామంలో ఉన్న టీడీపీ నేతలు, సర్వేయర్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

అధికారుల 'కాకి' లెక్కలు

రైతుకు భూమి ఆరో ప్రాణం. భూమిని పక్క పొలం వ్యక్తియో..బలం ఉన్న వారు ఆక్రమించి వివాదం సృష్టిస్తే సర్వేయర్లను ఆశ్రయించడం సర్వ సాధారణం. ఇందుకోసం ఎఫ్‌లైన్ పేరిట ఆన్‌లైన్‌లో రూ.550 కడితే సర్వేయర్ వచ్చి సర్వే చేయాలి. అయితే సర్వేయర్లు ఆ పని చేయడం లేదు. స్థానిక రాజకీయాలు, కాసులు ఇచ్చే వారి పనులు మాత్రమే చేస్తున్నారు. కాగా.. ఎఫ్‌లైన్‌లో ఆదోని డివిజన్‌కు సంబంధించి 3,262 దరఖాస్తులు రాగా వాటిలో 2,686 సమస్యలను పరిష్కరించినట్లు చెబుతున్నారు. కర్నూలు డివిజన్‌లో 2,124 దరఖాస్తులుగా రాగా 1,633 దరఖాస్తులను పరిష్కరించినట్లు చెబుతున్నారు. పత్తికొండ డివిజన్‌లో 3,214 దరఖాస్తులకుగాను 3,001 సమస్యలు పరిష్కారమైనట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు.

గ్రామసభలతో పరిష్కారం శూన్యం

ఏడాది క్రితం రీసర్వేలో లోపాలను సరిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గ్రామసభలను నిర్వహించింది. ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభలు నిర్వహించి రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించింది. అందులో భాగంగా జిల్లావ్యాప్తంగా 18,619 ఫిర్యాదులను నమోదు చేసి పరిష్కరించినట్లు సర్వే అధికారులు లెక్కలు చూపుతున్నారు. మరోవైపు రెవెన్యూ సమస్యల కోసం కూడా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించింది. ఇందులో రెవెన్యూ అంశాలతోపాటు సర్వే సమస్యలపై కూడా జిల్లా వ్యాప్తంగా 7,693 ఫిర్యాలను స్వీకరించారు. గ్రామ, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించినట్లు అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిమాత్రం మరో రకంగా ఉందని తెలుస్తోంది. ఆయా సదస్సుల్లో ఇచ్చిన ఫిర్యాదుల పరిష్కారం అయితే ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు ఎందుకు వస్తాయో అధికారులే చెప్పాలి.

షోకాజ్ నోటీసులు ఇచ్చాం



పీజీఆర్ఎస్‌లో సర్వే అంశాలపై ఫిర్యాదులు తగ్గాయి. వచ్చిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారం చేయాలని ఆదేశిస్తున్నాం. ఎఫ్ లైన్‌లో సర్వే కోసం చలానా కడితే కచ్చితంగా సర్వే చేయాలి. చేయకపోతే సంబంధిత మండల, విలేజ్ సర్వేయర్లు ఇబ్బంది పడతారు. ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్‌లో 10 మంది విలేజ్ సర్వేయర్లు, ఐదుగురు మండల సర్వేయర్లు డబ్బులు తీసుకున్నట్లు తేలడంతో వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చాం.

–మునికన్నన్, ఏడీ, సర్వే శాఖ

ప్రైవేటీకరణపై 'ప్రజా'గ్రహం

- జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన
- ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా



గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాస్వామ్య సంఘాల నాయకులు

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలోని వైద్య కళాశాలలను, ఆసుపత్రులను వ్యాపార కేంద్రాలుగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక నేతలు డిమాండ్ చేశారు. పలు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రకారం విద్య, వైద్య రంగాలను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. అయితే ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పబ్లిక్ ప్రైవేట్ పార్టిసిపేషన్ పేరుతో ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు జీఓ నెంబర్ 107/108 విడుదల చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ప్రజలకు రానున్న రోజుల్లో వైద్యం అందక తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఐక్య వేదిక కన్వీనర్ ఎం రామక్రిష్టారెడ్డి అధ్యక్షతన జరిగిన నిరసనలో కే రామాంజనేయులు (చేతి వృత్తుదారుల సమాఖ్య), పీ రాధాక్రిష్ణ (సీఐటీయు), ఎస్ మనోహర్ మాణిక్యం (ఏఐటీయుసీ), భార్గవ్ (పీఓపీ), జహంగీర్ (ఎస్‌డీపీఐ), హరీశ్వరరెడ్డి (ఏడీఏస్ఓ), సుబ్బరాయుడు (డీటీఎఫ్), కే శేషాద్రిరెడ్డి (జనవిజ్ఞాన వేదిక), డేవిడ్ (ప్రజా పరిరక్షణ సమితి), వీ నాగరాజు (ఏపీ ప్రజా నాట్య మండలి), కే శివనాగిరెడ్డి (స్పార్క్), జయన్న (భవన నిర్మాణ కార్మిక సంఘం), వివిధ సంఘాల నాయకులు సాయి ఉదయ్, అబ్దుల్లా, శరత్‌కుమార్, బీసన్న, వెంకట్రామిరెడ్డి, సుంకన్న, వాడాల శేఖర్‌రెడ్డి, కే శేషగిరి, సీ రమేష్, డీ ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కర్నూలుకు డీజీపీ

కర్నూలు: డీజీపీ హరీష్ కుమార్ గుప్త మంగళవారం కర్నూలులో పర్యటించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 16వ తేదీన జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో భద్రత ఏర్పాట్లను పరిశీలించేందుకు డీజీపీ కర్నూలుకు వస్తున్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు శాఖకు సమాచారం అందింది.

ముగిసిన దేవరగట్టు ఉత్సవాలు



నెరణికి చేరిన ఉత్సవమూర్తులు

హొళగుంద: దేవరగట్టు ఉత్సవాలు సోమవారం ముగిశాయి. శ్రీమాళ మల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరాయి. కాడసిద్ధప్ప మఠంలో ఉంచిన ఉత్సవమూర్తులకు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను, పల్లకీని నెరణికి గ్రామం ఊరువాకిలి వద్ద ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్దకు తీసుకొచ్చి అక్కడ కొలువుంచారు. దీంతో గ్రామంలో పండుగ వాతవరణం నెలకొంది. గ్రామస్తులు ఆలయం నుంచి విగ్రహాలను అర్చకుల ఇంటి వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. శ్రీ మాళమల్లేశ్వరుని కంకణధారణతో నిష్ఠతో ఉన్న ప్రజలు సోమవారం దీక్షను విరమించారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ నవ్య

కర్నూలు కల్చరల్: అర్జీలను గడువులోపు పరిష్కరించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం అధికారులకు సూచనలు ఇచ్చారు. అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. సీఎం కార్యాలయ గ్రీవెన్స్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వాటిని బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా పరిష్కరించాలన్నారు. డీఆర్వో వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అజయ్‌కుమార్, అనురాధ, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ కొండన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో మోసం

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు
- పీజీఆర్ఎస్‌కు 58 ఫిర్యాదులు



ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: రైల్వే శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి హైదరాబాద్‌కు చెందిన విజయభాస్కర్ రూ.7 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు కర్నూలుకు చెందిన దినేష్ నాయుడు ఫిర్యాదు చేశారు. కర్నూలు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి నేరుగా వారితో ఎస్పీప మాట్లాడారు. మొత్తం 58 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నిటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. పీజీఆర్ఎస్‌లో పాల్గొని అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

పత్తికొండ మార్కెట్‌లో విజిలెన్స్ తనిఖీలు



రైతులతో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు

పత్తికొండ: విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం పత్తికొండ మార్కెట్‌యార్డులో తనిఖీలు నిర్వహించారు. ధరలు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు విధానాలు, మార్కెటింగ్ అధికారుల పనితీరును పరిశీలించారు. ధరల హెచ్చుతగ్గుదలపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ చౌడేశ్వరిదేవి ఆదేశాలు మేరకు తనిఖీ చేశామన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌తో ఉల్లి పంట తొలగింపు



ఉల్లిపంటను ట్రాక్టర్‌తో తొలగిస్తున్న దృశ్యం

పత్తికొండ రూరల్: మార్కెట్‌లో ధర లేకపోవడంతో పందికోన గ్రామానికి చెందిన కస్తూరి రంగప్పరాజు అనే రైతు రెండెకరాల్లో ఉల్లి పంటను ట్రాక్టర్‌తో సోమవారం తొలగించాడు. పంట సాగు కోసం ఎకరాకు రూ.లక్షకు పైగానే ఖర్చు పెట్టాడు. మార్కెట్‌లో క్వింటా ధర రూ.200 మాత్రమే ఉండటంతో కోత ఖర్చులు కూడా రాబోవని పండిన పంటను ట్రాక్టర్‌తో దున్నేశాడు. దానిని గొర్రెల మంద వదిలాడు.

శనగ విత్తు అందక రైతుకు బెంగ

- రబీ మొదలైనప్పటికీ ప్రారంభం కాని సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ
- పాత బకాయిలు చెల్లిస్తేనే విత్తనాల సరఫరా అంటున్న ప్రయివేటు విత్తన కంపెనీలు
- విత్తనోత్పత్తి చేసిన రైతులకు రూపాయి కూడా విదిల్చని వైనం



కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేటులోని ఏపీ సీడ్స్ ప్రధాన కార్యాలయం

కర్నూలు (అగ్రికల్చర్): రబీ సీజన్ ప్రారంభమై వారం కావొస్తున్నా ఇప్పటి వరకు రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేయలేదు. సెప్టెంబరు నెలలో విస్తారంగా వర్షాలు పడటంతో రైతులు ముందస్తుగా శనగ సాగుకు సిద్ధమయ్యారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం విత్తనాల పంపిణీలో చేతులెత్తేసింది. కేవలం కాగితాలపై శనగ విత్తనాల కేటాయింపు, ధర, సబ్సిడీలు ఖరారు అయ్యాయి. ఇంతవరకు రైతులకు విత్తనం అందని పరిస్థితి ఏర్పడింది.

ఏపీ సీడ్స్ నిర్వీర్యం

ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీసీడ్స్) శనగ విత్తనాలు సరఫరా చేస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఏపీ సీడ్స్ నిర్వీర్యం అయింది. 2024 ఖరీఫ్, 2024-25 రబీ, 2025 ఖరీఫ్ సీజన్‌లలో ఏపీసీడ్స్ సరఫరా చేసిన విత్తనాలకు సబ్సిడీకి సంబంధించి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. కొన్ని ప్రయివేటు విత్తన కంపెనీలు రైతులతో శనగ ఉత్పత్తి చేయిస్తాయి. ప్రభుత్వం టెండరు ద్వారా ఖరారు చేసిన ధరలకు ఈ కంపెనీలు ఏపీ సీడ్స్‌కు సరఫరా చేస్తాయి. ప్రయివేటు విత్తన కంపెనీల దగ్గర శనగ విత్తనాలు ఉన్నప్పటికీ పాత బకాయిలను చెల్లించకపోవడంతో సరఫరా చేసేందుకు ముందుకు రావడం లేదు. పాత బకాయిలు చెల్లిస్తేనే సరఫరా చేస్తామని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిలను చెల్లించకపోవడంతో నేడు విత్తన సమస్య తీవ్రమై కూర్చుంది.

యాప్ ఇవ్వకుండా ఆదేశాలు

శనగ విత్తనాలను ఈ నెల 3వ తేదీ నుంచి పంపిణీ చేసేందుకు రైతు సేవా కేంద్రాల్లో సిద్ధం చేయాలని ఏపీసీడ్స్‌కు వ్యవసాయ శాఖ ఆదేశాలు ఇచ్చింది. అయితే ఇందుకు యాప్ ఇవ్వలేదు. డీ క్రిషి యాప్ ఇస్తేనే రిజిస్ట్రేషన్‌లు మొదలవుతాయి. విత్తన పంపిణీకి వీలవుతుంది. యాప్ ఇవ్వకపోవడం, ప్రయివేటు విత్తన కంపెనీలు సహకరించకపోవడంతోనే విత్తనాల పంపిణీ దిశగా ఎలాంటి చర్యలు లేవు. కర్నూలు జిల్లాలో కౌతాళం, కోసిగి మండలాలు, నంద్యాల జిల్లాలో మహానంది, శిరివెళ్ల మండలాలు మినహా మిగిలిన అన్నిమండలాల్లో శనగ సాగు చేస్తారు. సబ్సిడీ విత్తనాలు అందుబాటులోకి రాకపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ప్రయివేటు వ్యాపారుల దగ్గర విత్తనాలు కొని సాగు చేస్తున్నారు. ఇప్పటికే ఆలూరు ప్రాంతంలో శనగ విత్తనం పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

రూపాయి ఇవ్వకుండానే విత్తన సేకరణ

ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ ప్రతి ఏటా రైతులకు బ్రీడర్ సీడ్, సర్టిఫైడ్ సీడ్ ఇచ్చి విత్తనోత్పత్తి చేయిస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ మండలాల్లో 2024 రబీలో విత్తనోత్పత్తి చేయించింది. విత్తనోత్పత్తి చేసిన 100 మందికిపైగా రైతుల నుంచి ఏపీ సీడ్స్ 10 వేల క్వింటాళ్ల విత్తనాలను సేకరించింది. మామూలుగా అయితే ఉత్పత్తి చేసిన విత్తనాలను సేకరించే సమయంలోనే అడ్వాన్స్ కింద క్వింటాకు రూ.5,000 ఆపైన చెల్లిస్తారు. ప్రభుత్వం విత్తనోత్పత్తి ధరలను ఖరారు చేసిన తర్వాత మిగిలిన మొత్తం చెల్లిస్తారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత మొదటి సారిగా రైతులకు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే ఏపీసీడ్స్ 10 వేల క్వింటాళ్ల శనగ విత్తనాలను సేకరించింది. 2024 రబీలో విత్తనోత్పత్తి చేసిన రైతులకు మళ్లీ రబీ వచ్చినప్పటికీ ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. విత్తనోత్పత్తి చేసిన రైతులు అడ్వాన్స్ కోసం ఏపీ సీడ్స్ చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు.

ఉద్దేశపూర్వకంగానే...

2019 నుంచి 2024 వరకు ప్రతి ఏడాది సెప్టెంబర్ 20వ తేదీనే సబ్సిడీ శనగ విత్తన పంపిణీ జరిగేది. రబీ ప్రారంభానికి ముందే ఈ కార్యక్రమం పూర్తయ్యేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది రబీ సీజన్‌లో ఇదే సమయానికి 10వేల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సారి ఎలాంటి కదలిక లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మరో నాలుగు రోజుల్లో కూడా యాప్ వచ్చే అవకాశం లేదు. రాయలసీమకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రెండున్నర లక్షల క్వింటాళ్ల శనగ విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేసేది. ప్రస్తుత ప్రభుత్వం లక్ష క్వింటాళ్లు కూడా కేటాయించలేదు. ఉద్దేశపూర్వకంగానే రాయలసీమ రైతులకు అన్యాయం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



ఆదోని మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన పత్తిని పరిశీలిస్తూ రైతుల సమస్యలు తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నాయకులు

ఆదోని టౌన్/ఆదోని రూరల్: భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమయ్యిందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు భరత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం కర్నూలు జిల్లా నాయకులు రవిచంద్రారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం ఆధ్వర్యంలో పార్టీ ఆదోని మండల అధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చంద్రకాంత్‌రెడ్డి తదితరులతో కలిసి సోమవారం ఆదోని మార్కెట్‌యార్డులో వారు పర్యటించారు. భారీ వర్షాలతో నష్టపోయిన పంటల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ.. భారీ వర్షాలతో పత్తి, వేరుశనగ, కంది తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. రైతులు ఆర్థికంగా నష్టపోయారన్నారు. అరకొరగా వచ్చిన పత్తి దిగుబడులను సీసీఐ ద్వారా మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులతో అత్యవసరంగా పంట నష్టం అంచనా వేయాలన్నారు. నష్టపోయిన ప్రతిరైతుకూ పరిహారం అందించాలన్నారు. రైతులను ఆదుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం మార్కెట్‌యార్డు కార్యాలయ సెక్రటరీ గోవిందుకు వినతి పత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ ఆదోని నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ ప్రతాపరెడ్డి, రాష్ట్ర యూత్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్రహారంలో పట్ట పగలే చోరీ

- 3 తులాల బంగారం, రూ.10 వేల నగదు అపహరణ



బీరువా ధ్వంసం చేసిన దృశ్యం

ఆలూరు రూరల్: మండలంలోని అగ్రహారం గ్రామంలోని ఓ ఇంట్లో పట్ట పగలే దొంగలు పడ్డారు. ఇంటి తలుపులు, బీరువా ధ్వంసం చేసి మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేలు అపహరణ చేశారు. గ్రామానికి చెందిన ఉరుకుందప్ప సోమవారం ఉదయం 8 గంటలకు ఇంటి తలుపులకు తాళాలు వేసి భార్యతో కలిసి పొలానికి వెళ్లాడు. పొలం పనులు ముగించుకుని సాయంత్రం 5 గంటలకు ఇంటికి రాగా తాళాలు పగులగొట్టి చోరీ చేసిన విషయాన్ని గుర్తించాడు. బీరువాలో ఉన్న 3 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు ఆలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆలయ భూమిలో అక్రమ మైనింగ్‌పై దాడి



దేవదాయశాఖ భూమిలో తవ్వకాలను పరిశీలిస్తున్న మైనింగ్‌శాఖ ఆర్‌ఐ రెడ్డప్ప

బనగానపల్లె రూరల్: పలుకూరు గ్రామంలోని రామేశ్వరస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్ 308లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై బనగానపల్లె భూగర్భ గనుల శాఖ ఆర్‌ఐ రెడ్డప్ప సోమవారం ఆకస్మిక దాడి చేశారు. దాడి విషయం ముందుగానే తెలుసుకున్న సుమారు ఆరుగురు మైనింగ్‌దారులు అక్కడి నుంచి పారిపోయినట్లు సమాచారం. వారిలో బాబాయి, లక్ష్మయ్య, నాగమయ్య, రాజన్నలు ఉన్నారని ఆలయ అర్చకులు భాస్కరయ్య తెలిపారు. ఆర్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకున్నప్పటికీ, మైనింగ్ దారులు పారిపోవడంతో ఎటువంటి స్వాధీనం జరగలేదని తెలిసింది. ఈ అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆలయ అర్చకులు మండల తహసీల్దార్‌ను కోరారు. ఈ దాడుల్లో వీఆర్‌ఐ, సర్వేయర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహం అపహరణ




అమ్మవారి విగ్రహం చోరీకి గురైన దృశ్యం

హాలహర్వి: దేవుళ్ల విగ్రహాలను సైతం దొంగలను అపహరిస్తున్నారు. పచ్చారపల్లి గ్రామంలోని సుంకులమ్మదేవి ఆలయంలో అమ్మవారి వెండి విగ్రహాన్ని అపహరించారు. అలాగే అమ్మవారి తాళిబొట్టు, ముక్కుపుడక, ఒకటిన్నర తులం బంగారాన్ని చోరీ చేశారు. సోమవారం ఉదయం అర్చకుడు దేవేంద్రప్ప ఆలయానికి పూజ చేయడానికి వెళ్లి చూడగా విగ్రహం కనిపించలేదు. దీంతో స్థానికులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు అక్కడికి చేరుకుని వెంటనే హాలహర్వి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ మారుతి ఘటనా స్థలానికి చేరుకున్నారు. కర్నూలు నుంచి క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరిస్తున్నారు. పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



ఎగువ అహోబిలం కొండపై నుంచి జాలువారుతున్న జలపాతాలు



కిందకు దూకుతున్న జలపాతం





క్షేత్రం ఎదుట జల పరవళ్లు, మెట్ల మార్గంలో వరద ప్రవాహం

అహో జలం

అహోబిల క్షేత్రంలో జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నల్లమల అడవి పచ్చదనాన్ని పరుచుకోవడంతో పాటు ఎత్తైన కొండ చరియల్లోంచి నీటి ధారలు జాలువారుతూ భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఎగువ అహోబిలం జ్వాలా నృసింహస్వామి సన్నిధి, ఉక్కు స్తంభం రహదారి వెంట జలపాతాలు ఉద్ధృతంగా కిందకు దూకుతూ ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. నవనారసింహ స్వాముల దర్శనార్థం వచ్చే భక్తులు, పర్యాటకులు జల సోయగాలను చూస్తూ మురిసిపోతున్నారు. – ఆళ్లగడ్డ

రేపటి నుంచి తేనెటీగల పెంపకంపై శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): శాస్త్రీయ పద్ధతులకు అనుగుణంగా తేనెటీగల పంపకంపై రైతులకు ఈ నెల 8 నుంచి ఏడు రోజుల శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మిగనూరు మండలం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉద్యాన శాఖ, బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా మొత్తం ఆరు బ్యాచ్‌లకు శిక్షణ కొనసాగుతుందన్నారు. శిక్షణ పొందిన రైతులకు ఉద్యాన శాఖ తేనెటీగల పెంపకానికి రాయితీలు ఇస్తుందన్నారు. అదే విధంగా 50 శాతం సబ్సిడీపై బాక్స్‌లు కూడా అందిస్తామన్నారు. ఒక్కో బ్యాచ్‌లో 25 మందికి మాత్రమే అవకాశం ఉందని, అయితే ఇప్పటికే 160 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

యాగంటిని సందర్శించిన విదేశీయులు

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామిని సోమవారం దక్షిణ కొరియాకు చెందిన ఐదుగురు దర్శించుకున్నారు. వీరు భారతదేశంలోని పలు క్షేత్రాలను దర్శించుకుంటూ యాగంటికి చేరుకున్నారు. వీరు క్షేత్ర విశిష్టతలు తెలుసుకుని క్షేత్ర పరిసరాలను ఆసక్తిగా తిలకించారు.



యాగంటి క్షేత్రంలో దక్షిణ కొరియా దేశస్తులు

పీహెచ్‌సీల్లో నర్సులే వైద్యులు!

- కొనసాగుతున్న వైద్యుల సమ్మె

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల సమ్మె కొనసాగుతోంది. దంతో ఫార్మాసిస్టులు, నర్సింగ్ సిబ్బందే రోగులకు మాత్రలు ఇచ్చి పంపిస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం వైద్యులు విధులు బహిష్కరించారు. అలాగే ఓపీ సేవలతో పాటు అత్యవసర సేవలనూ నిలిపివేశారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులను 35 మందిని పీహెచ్‌సీల్లో సర్దుబాటు చేశారు. ససేమిరా అంటున్న కొందరు వైద్యులను అధికారులు బలవంతంగా బెదిరించి పంపిస్తున్నారు. ఇప్పుడు అధికారుల ఆదేశాలను సైతం పలువురు వైద్యులు ఖాతరు చేయడం లేదు. సోమవారం కేవలం 15 మంది వైద్యులు మాత్రమే విధులకు హాజరయ్యారు. ఇందులో ఉలిందకొండ, హుసేనాపురం, మద్దికెర, కోసిగి, లద్దగిరి, క్రిష్ణగిరి, ఇ.తాండ్రపాడు, గార్గేయపురం, కలుదేవకుంట్ల, హాలహర్వి-ఎ, గూడూరు, దైవందిన్నె, పగిడిరాయి, పెద్దకడుబూరు, పుచ్చకాయలమడ పీహెచ్‌సీలు ఉన్నాయి. మిగిలిన పీహెచ్‌సీల్లో వైద్యులు రాకపోవడంతో అక్కడున్న ఫార్మాసిస్టులు, నర్సింగ్ సిబ్బందే రోగులకు మాత్రలు ఇచ్చి పంపిస్తున్నారు. వైద్యుల సమ్మె కారణంగా పీహెచ్‌సీలకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు వెళ్లే సంచార చికిత్స వాహనాలు(104) కూడా వెళ్లడం మానేశాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు వైద్యచికిత్సలు, వైద్యపరీక్షలు, మందులు కరువయ్యాయి. మరోవైపు ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్‌లో భాగంగా స్కూల్‌హెల్త్ వైద్యశిబిరాలు, స్వస్తనారీ సశక్తి అభియాన్ కార్యక్రమాలు అటకెక్కాయి. గ్రామాల్లో వైద్యులు లేకపోవడంతో ప్రజలు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా కేంద్రంలోని పెద్దాసుపత్రికి చికిత్స కోసం వస్తున్నారు. కొందరు తాత్కాలికంగా స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీలను సంప్రదించి చికిత్స తీసుకుంటున్నారు.

గ్యాస్ లీకై ఇంట్లో భారీ పేలుడు

- భార్యాభర్తలకు, ఇద్దరు కుమారులకు తీవ్ర గాయాలు





తీవ్రంగా గాయపడిన వడ్డె నాగరాజు, సువర్ణ



అనిల్



చరణ్

వెల్దుర్తి: గ్యాస్ లీకై మంటలు చెలరేగి భారీ పేలుడు సంభవించి ఇల్లు ధ్వంసం కావడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ దుర్ఘటన వెల్దుర్తి మండలం బోయనపల్లె గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంట ప్రాంతంలో చోటుచేసుకుంది. గాయపడిన వారిలో వడ్డె నాగరాజు, అతని భార్య సువర్ణ (6 నెలల గర్భిణి), వారి కుమారులు అనిల్, చరణ్ ఉన్నారు. వడ్డె నాగరాజు గౌండ పని చేస్తూ గ్రామంలో చర్చి వద్ద ఉన్న ఇంట్లో బాడుగకు నివాసముంటున్నాడు. ప్రతిరోజులాగే ఆదివారం అందరూ ఇంట్లో నిదురించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత పేలుడు శబ్దం రావడంతో చుట్టపక్కల వారు లేచి వచ్చి చూశారు. అప్పటికే ఇంటి చెక్క తలుపు విరగగొట్టబడి అందులో నుంచి పదేళ్ల అనిల్, నాలుగేళ్ల చరణ్ మంటలతో బయటకు రావడం గమనించారు. వారి మంటలార్పే సమయంలో 'అమ్మా, నాన్నలు మంటల్లో కాలిపోతున్నారు' అని అనడంతో ఇంట్లోకి ప్రవేశించి వడ్డె నాగరాజు, అతని భార్య సువర్ణను కాపాడారు. సిలిండర్ వద్ద గ్యాస్ లీకై ఇంటి నిండా వ్యాపించి ఉండగా అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో వడ్డె నాగరాజు లేచి లైట్ వేయడంతోనో, బీడీ అంటించుకునే ప్రయత్నంలోనో పేలుడుతో కూడిన మంటలు రేగినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. పేలుడు ధాటికి గోడలు బీటలు వారి, తలుపు విరిగి, ఇంట్లో వస్తువులు చిందర వందరగా పడ్డాయి. తీవ్రగాయాలతో ఉన్న నలుగురిని హుటాహుటిన కృష్ణగిరి 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గ్రామానికే చెందిన గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్ సుంకన్న సంఘటనాస్థలికి చేరుకుని విచారించారు. సిలిండర్ ఆఫ్ చేయకపోవడం, స్టవ్ నాబ్ పూర్తిగా కట్టకపోవడంతో గ్యాస్ లీకైనట్లు తెలుస్తోందన్నారు. తీవ్రగాయాలైన నలుగురికి దాదాపు 50 శాతం మేర గాయాలైనట్లు కర్నూలు జీజీహెచ్ వైద్యులు ధృవీకరించి చికిత్స అందిస్తున్నారు. వెల్దుర్తి పోలీసులు విచారణ చేస్తున్నారు. తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు అశోక్ రెడ్డి, గ్రామ నాయకుడు కాంతారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న కోరారు.



ప్రమాదానికి కారణమైన గ్యాస్ సిలిండర్, స్టవ్

మట్టి మిద్దె కూలి చిన్నారి మృతి





లలిత(ఫైల్), సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఐ జనార్దన్ రావు

మంత్రాలయం రూరల్: మట్టి మిద్దె కూలి ఐదేళ్ల చిన్నారి లలిత మృత్యువాత పడింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంత్రాలయం మండలం మాధవరం గ్రామం బీసీ కాలనీకి చెందిన ఉలువ బీమరాయుడుతో పాటు భార్య బోయ నాగమ్మ, వారి కొడుకు రామాంజనేయులు, కుమార్తె శ్రావణి, మనవరాలు లలిత(5) ఇంట్లో నిద్రిస్తున్నారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు మట్టి మిద్దె పూర్తిగా తడిసి ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఒక్కసారిగా కూలి పోయింది. పెద్ద ధ్వని రావడంతో ఇరుగుపొరుగు వారు వచ్చిన మట్టిని, జెంతలను తొలగించి కుటుంబ సభ్యులను బయటకు తీశారు. ప్రమాదంలో చిన్నారి లలిత స్పృహ కోల్పోయింది. నాగమ్మ, రామాంజనేయులు, శ్రావణి, భీమరాయుడికి స్వల్ప గాయాలతో బయట పడ్డారు. లలిత స్పృహకోల్పవడంతో వెంటనే ఆర్‌ఎంపీని సంప్రదించగా మృతి చెందినట్లు తెలిపారు. గోనేగండ్ల మండలం గంజహళ్లి గ్రామానికి చెందిన మహేశ్వరి, రామాంజి దంపతుల కుమార్తె లలితను చదువు నిమిత్తం తాత భీమరాయుడు వద్ద ఉంచారు. తాత వద్ద ఉంటూ నర్సరీ చదువుతూ ఆటపాటలతో అలాడుతున్న చిన్నారి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. సంఘటన స్థలాన్ని ఆర్‌ఐ జనార్దన్‌రావు పరిశీలించి వివరాలు, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతురాలు తల్లి మహేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

ఎస్సార్‌బీసీ కాల్వలో పడి యువకుడి మృతి

బనగానపల్లె: నందవరం గ్రామ సమీపంలో సోమవారం ఉదయం ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వలో ప్రమాదవశాత్తు పడి ఓ యువకుడు మృతి చెందాడు. నందివర్గం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. నందివర్గం గ్రామానికి చెందిన చాకలి నరేష్ (20) ఓ పెళ్లి నిమిత్తం దీబగుండ్ల గ్రామానికి వెళ్లాడు. ఆదివారం చెరువుపల్లె గ్రామంలో మళ్లీ పెళ్లికి హాజరై సోమవారం తెల్లవారు జామున స్నేహితుడు చరణ్‌తో కలసి బైక్‌పై తిరిగి దీబగుంట్లకు బయల్దేదారుడు. మార్గమధ్యలో ప్రమాదశాత్తు బైక్‌తో పాటు ఇద్దరు ఎస్సార్‌బీసీలో పడిపోగా.. చరణ్‌కు ఈత రావడంతో బయటపడ్డాడు. నరేష్ నీటిలో కొట్టుకుపోతుండగా స్థానికులు కాపాడినా అప్పటికే మృతి చెందాడు. తండ్రి పక్కీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్'తో ఎంతో మేలు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాధవ్

కర్నూలు కల్చరల్: 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్' కార్యక్రమంతో సామాన్య మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. బీజేవైఎం రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా సునీల్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం బీఏఎస్ కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాధవ్ మాట్లాడుతూ బీజేవైఎం ఆధ్వర్యంలో స్వదేశీ వస్తువుల వినియోగంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. మోదీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈనెల 16న ప్రధానమంత్రి నరేంద్రమోదీ జిల్లా పర్యటనకు వస్తున్నారని, ప్రజలు ఘన స్వాగతం పలకాలని కోరారు. సూపర్ జీఎస్టీపై కర్నూలులో జరిగే బహిరంగ సభలో ప్రధాని మాట్లాడతారన్నారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు రమేష్ నాయుడు, దయాకర్ రెడ్డి, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గీతామాధురి, శ్రీశైలం దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సులు కిటకిట



బస్సు ఎక్కేందుకు గుమికూడిన ప్రయాణికులు

కొలిమిగుండ్ల: దసరా సెలవులు ముగియడంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ నెలకొంది. తెల్లవారుజాము నుంచే ప్రజలు ప్రయాణాలు మొదలు పెడుతున్నారు. సోమవారం ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు వారి తల్లులు అధిక సంఖ్యలో కొలిమిగుండ్ల, అవుకు బస్టాండ్లకు చేరుకున్నారు. వివిధ రకాల పనుల నిమిత్తం పోయే సాధారణ ప్రయాణికుల సంఖ్య ఎక్కువ కావడంతో ఎక్కడ చూసినా జనాలే కనిపించారు. ఆర్టీసీ బస్సుల్లో ముందున్న స్టేజీల నుంచే ఓవర్‌లోడ్‌తో వచ్చాయి. చాలా మంది పుట్‌బోర్డు మీద నిలబడి ప్రమాదకర ప్రయాణం చేయాల్సి వచ్చింది. చిన్న పిల్లలు, గర్భిణులు బస్సులు ఎక్కలేని పరిస్థితి ఎదురైంది. వచ్చిన ప్రతి బస్సులో పుట్‌బోర్డు వరకు ప్రయాణికులే కనిపించారు. బస్టాండ్ల వద్ద గంటల సమయం వేచి చూసినా బస్సుల్లో ఏమాత్రం రద్దీ తగ్గలేదు. మార్గమధ్యలోనే పల్లెల్లో బస్సులు ఆపకుండానే వెళ్లాల్సి వచ్చింది. కండక్టర్లు టికెట్లు ఇచ్చేందుకు అష్టకష్టాలు పడ్డారు. ప్రత్యేక రోజుల్లో ఆర్టీసీ అధికారులు అదనపు సర్వీసులు నడపకపోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనుమానం పెనుభూతమై!

- భార్యను కిరాతకంగా చంపిన భర్త
- తలపై ఇటుకతో మోది..
- మృతదేహాన్ని మిద్దెపై నుంచి కిందకు పడేసిన వైనం



హత్యకు గురైన ఓలమ్మ (ఫైల్)

ఆళ్లగడ్డ: జీవితాంతం తోడు ఉంటానంటూ మూడు ముళ్లు వేశాడు.. ఏడు అడుగులు నడిచాడు. వారి అన్యోన్య దాంపత్యానికి నలుగురు పిల్లలు పుట్టారు. 20 ఏళ్ల తర్వాత భార్యపై అతనికి అనుమానం మొదలైంది. అది పెనుభూతమై చివరకు ఆమెను అతి కిరాతకంగా అంతమొందించాడు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆళ్లగడ్డ మండలం ఆర్. కృష్ణాపురం గ్రామానికి చెందిన ఓలమ్మ (40)కి ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని చింతకుంటకు చెందిన శేషగిరితో సుమారు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు. వారికి ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. సాఫీగా సాగిపోతున్న సంసారంలో అనుమానం పెనుభూతమైంది. భార్యకు వివాహేతర సంబంధం ఉందని అనుమానంతో నిత్యం గొడవలు జరుగుతుండేవి. దీంతో విసుగు చెందిన ఓలమ్మ వారం రోజుల క్రితం పుట్టినిల్లు ఆర్ కృష్ణాపురం చేరుకుంది. ఈ క్రమంలో ఆదివారం భార్య దగ్గరికి వచ్చిన ఆయన తనతో రావాలని చెప్పడంతో సోమవారం ఉదయం పోదామని చెప్పింది. కింది ఇంట్లో ఓలమ్మ తల్లి, అన్న నిద్రించగా ఓలమ్మ, భర్త శేషగిరిలు మిద్దెపై గదిలో నిద్రించారు. ఈ క్రమంలో వారి మధ్య మాటామాటా పెరిగి భార్యను ఇటుకతో తలపై మోది హత్య చేశాడు. అనంతరం మృతి చెందిన ఓలమ్మను మిద్దెపై నుంచి కిందకు విసిరి పడేసి అక్కడ నుంచి శేషగిరి పారిపోయాడు. ఏదో శబ్దం వచ్చిందని ఇరుగుపొరుగు వారు వచ్చి చూడగా విగతజీవిగా పడిఉన్న ఓలమ్మను గమనించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ మురళీధర్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మృతురాలి అన్న ఓబులేసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ప్రియురాలి వేధింపులతో యువకుడి ఆత్మహత్య





ధనుంజయ్‌గౌడ్ (ఫైల్) సుసైడ్ నోట్

ఎమ్మిగనూరు రూరల్: ఇరువురూ ప్రేమించుకున్నారు. పెద్దలు ఒప్పుకోకపోవడంతో ఎవరికి వారు పెళ్లి చేసుకున్నారు. ఆమెకు ఇద్దరు పిల్లలు. ఆ తర్వాత కూడా ప్రియుడితోనే ఉండేందుకు నిశ్చయించుకుంది. పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడం, లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో ఆ యువకుడు సూసైడ్ నోట్ రాసుకొని తనే ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎమ్మిగనూరు మండలం గువ్వలదొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన భీమన్నగౌడ్, రాజమ్మలకు అనికుమార్‌గౌడ్, సునీల్‌కుమార్‌గౌడ్, ధనుంజయ్‌గౌడ్, జయలక్ష్మీలు సంతానం. ధనుంజయ్‌గౌడ్(27) పెళ్లి కాక ముందు నుంచే గ్రామానికి చెందిన, వయస్సులో తనకన్నా పెద్దదైన శశికళను ప్రేమించాడు. కులాలు వేరుకావటం, వయసులో పెద్దది కావటంతో పెద్దలు, తల్లిదండ్రులు ఇద్దరికీ సర్దిచెప్పడంతో దూరంగా ఉంటున్నారు. శశికళను మంత్రాలయంకు చెందిన వ్యక్తితో పెళ్లి చేశారు. వీరికి ఇద్దరు సంతానం. ధనుంజయ్‌గౌడ్(27) ఎమ్మిగనూరులో మెడికల్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఎర్రకోటలోని తన మేనమామ కృష్ణగౌడ్ కుమార్తె సాయిప్రియతో 2022 జూన్‌లో వివాహమైంది. అయితే శశికళకు పెళ్లై పిల్లలున్నా ధనుంజయ్‌గౌడ్‌తో తిరిగి స్నేహం కొనసాగించింది. ఇరువురూ ఊరు వదలి పారిపోయారు. కుటుంబ సభ్యులు ఇద్దరినీ పిలుచుకొచ్చి సర్దిచెప్పారు. ఆ తర్వాత మరోసారి కూడా ఇరువురూ పారిపోవడంతో ధనుంజయ్‌గౌడ్ భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. విడాకుల కేసు కోర్టు నడుస్తోంది. ఈ నేపథ్యంలో శశికళ భర్త, ఇద్దరు పిల్లలను వదలి ధనుంజయ్‌గౌడ్ వద్దకు చేరుకుంది. చేసేది లేక కర్నూలు రోడ్డులోని ఓ లేడీస్ హాస్టల్‌లో శశికళను ఉంచి తాను ఎమ్మిగనూరులోనే ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అయితే శశికళ తనను పెళ్లి చేసుకోవాలని, ఎన్ని రోజులు హాస్టల్లో పెడతావంటూ వేధించడం మొదలుపెట్టింది. ఈ క్రమంలోనే ఆదివారం గువ్వలదొడ్డికి వెళ్లిన ధనుంజయ్‌గౌడ్‌కు హాస్టల్లో ఉన్న శశికళ వీడియోకాల్ చేసి నన్ను తీసుకెళ్లకపోతే ఉరేసుకొని చనిపోతానంటూ బెదిరించింది. ఆమె చనిపోతే కేసు తన మీదకే వస్తుందని భయాందోళనకు లోనైన ధనుంజయగౌడ్ నాలుగు పేజీల సూసైడ్ నోట్ రాసి పొలంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుమారుడు ఎంతకీ ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు పొలం దగ్గరకు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక మరణించాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు సోమవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు.

శశికళను భర్త, పిల్లల దగ్గరకు చేర్చండి

ధనుంజయ్‌గౌడ్ తన సుసైడ్ నోట్‌లో "నేను చనిపోతున్నా.. శశికళను తన భర్త, పిల్లల దగ్గరకు చేర్చి పుణ్యం కట్టుకోండి" అని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులును కోరాడు. "శశికళ భర్త చాలా మంచివాడు, శశికళ చనిపోతానని నన్ను భయపెట్టినందుకే నేను తప్పు చేశాను. నా చావే అన్నింటికీ పరిష్కారం.. అమ్మా.. నాన్నా నన్ను క్షమించండి. మేన మామకు వేరీ వేరీ సారీ. చెల్లెలు బుజ్జమ్మను కలెక్టర్‌గా చూడాలనుకున్నా.. ప్రియురాలి కోసం అందరినీ దూరం చేసుకున్నా. ఇక సెలవు.." అనే సమాచారంతో నాలుగు పేజీల సూసైడ్ నోట్ రాసుకుని తనువు చాలించాడు.